# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | SIDDIPET




- బీఆర్‌ఎస్‌లో సమరోత్సాహం
- సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పూర్తికి హరీశ్‌రావు నేతృత్వంలో పోరాటం
- నెలాఖరులో భారీ సభకు బీఆర్‌ఎస్ సన్నాహాలు
- ఉమ్మడి మెదక్ జిల్లా సమస్యలపై పోరాటం చేయనున్న బీఆర్‌ఎస్






# బీఆర్‌ఎస్ పోరుబాట

## గులాబీ అధినేత కేసీఆర్ మాటలతో క్యాడర్‌లో ఫుల్ జోష్

సిద్దిపేట, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం చేసిన వ్యాఖ్యలు గులాబీ దళంలో జోష్‌ను నింపాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరు చేద్దామని కేసీఆర్ ఇచ్చిన పిలుపు క్యాడర్‌లో సమరోత్సాహాన్ని నింపింది. కేసీఆర్ మాట్లాడిన వీడియోలను వాట్సాప్ స్టేటస్, ఇన్‌స్టాగాం, ఇతర సామాజిక మాధ్యమాల్లో పెట్టుకొని హల్‌చల్ చేశారు. ఇక మా బాస్ కేసీఆర్ బయలు దేరుతుండు..ఇక కాసుకోండి అంటూ బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు అధికార కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ క్యాడర్ అంతా కలిసికట్టుగా మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ప్రజాసమస్యలపై పోరుబాట పట్టనున్నారు. కొట్లాడితే కాని రాదని, కొట్లాట తప్పదన్న కేసీఆర్ వ్యాఖ్యల స్ఫూర్తితో బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుకు కదలనున్నారు. శుక్రవారం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం మండలం మేదపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పరమేశ్వర పటేల్ ఆధ్వర్యంలో రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాదయాత్రగా వచ్చి కలిశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ మాటలు అధికార కాంగ్రెస్ పార్టీలో గుబులు రేకెత్తించాయి. మొదటి నుండి ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్‌కు కంచుకోట. ఈ ప్రాంత రైతులను సమీకరించి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో పోరాటం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రత్యక్ష పోరాటాల ద్వారా సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను సాధిద్దామని కేసీఆర్ ప్రకటించారు. దీంతో సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల సాధనలకు హరీశ్‌రావు నేతృత్వంలో పోరుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతోంది. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం పనులను ఆపి రైతులను ఇబ్బంది పెడుతున్నది. దీనిపై బీఆర్‌ఎస్ రణం చేయనున్నది. అలాగే రైతులకు పంట రుణమాఫీ కాలేదు, రైతుభరోసా పత్తా లేదు. కేసీఆర్ కిట్టు లేదు. ఆసరా పింఛన్ల పెంపు లేదు. ఇలా పలు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడానికి బీఆర్‌ఎస్ క్యాడర్ సమాయత్తం అవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలను దీటుగా ఎదుర్కోనేలా బీఆర్‌ఎస్ తన కార్యాచరణ సిద్ధం చేస్తున్నది. యాసంగి సాగులో రైతులకు ఇబ్బందులు స్టార్ట్ అయ్యాయి. వాటిపై ప్రధానంగా దృష్టి సారించనున్నది. విద్యుత్ సమస్య అప్పుడే మొదలైంది. తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. సాగునీరు ఇవ్వడం లేదు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రధాన సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్‌ఎస్ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నది. ఇప్పటికే రైతు సమస్యలపై ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల రైతు సభలను ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగట్టింది. ఇకపై రెట్టించిన ఉత్సాహంతో బీఆర్‌ఎస్ క్యాడర్ ప్రభుత్వంపై పోరాటం చేయనున్నది.



## కాంగ్రెస్ మాయమాటలు
# నమ్మి మోసపోవద్దు



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- కల్లు దుకాణాలపై దాడులు.. గౌడన్నల అరెస్టులు
- రాష్ట్రంలో రైతులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటుండ్రు
- వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు నెరవేర్చలేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపాటు
- మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో రేణుకాఎల్లమ్మ విగ్రహావిష్కరణ

మెదక్, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ)/ కౌడిపల్లి: కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పి మాట తప్పారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో గ్రామ దేవతల ప్రతిష్ఠలు, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలు బాగా పెరిగాయని గుర్తుచేశారు. పదేండ్లలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం అయ్యిందని, అందుకే గ్రామాల్లో గ్రామ దేవతలను ప్రతిష్ఠ చేస్తున్నారని గుర్తుచేశారు. పదేండ్లు కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆబ్కారీశాఖ కల్లు దుకాణాలపై దాడులు జరగలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గౌడకులస్తులు నడిపే కల్లు దుకాణాలపై దాడులు చేయిస్తున్నదని మండిపడ్డారు. గౌడ్స్‌ను అరెస్ట్ చేసి జైలులో వేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 50 ఏండ్లకే పెన్షన్ ఇచ్చారని, రూ. 5 లక్షల బీమా కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

### పైసలు పడ్డాయా?

''జనవరి 26న నాలుగు పథకాలను ప్రారంభించారు సీఎం రేవంత్‌రెడ్డి. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందరికీ వచ్చిందా... మండలానికి ఒక గ్రామంలోనే రైతు భరోసా డబ్బులు వేశారు.. మిగతా గ్రామాల రైతుల పరిస్థితి ఏమిటీ.''. అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏం ఇవ్వకుండానే ఎన్నికల కోడ్‌తో తప్పించుకుందామని చూస్తున్నాడు... రైతులు, ప్రజలు ఒక్కసారి ఆలోచించండి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే ఏం జరుగుతుందో అని ప్రజలకు సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయాన్ని అర్హులైన ప్రతి రైతుకు పైసలు వేశాడని గుర్తుచేశారు. ఎన్నికల నెపంతో మోసం చేసే కార్యక్రమాలు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని పథకాలు అమలు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, రియల్ ఎస్టేట్ బిల్డర్లు సైతం ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కరోనా వచ్చినా కేసీఆర్ రైతుబంధు ఆపలేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి రాగానే రూ.200 పింఛన్‌ను రూ.2వేలు చేశారని, రైతుబంధు ఎకరాకు రూ.10వేలు, కల్యాణలక్ష్మి రూ.లక్ష, 24 గంటలు ఉచిత కరెంట్ ఇచ్చారని గుర్తుచేశారు. గీతకార్మికుల చెట్ల పన్ను, పాత బకాయిలను కేసీఆర్ రద్దు చేశారన్నారు. పండిన పంటగింజ లేకుండా కొన్నాడని, ముదిరాజ్‌లకు చేప పిల్లలు, గొల్ల కుర్మలకు గొర్రెలను పంపిణీ చేశారని, గీత కార్మికులకు వైన్స్ షాపుల్లో 16 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామగౌడ్, మాజీ జడ్పీటీసీ కవిత, ఆయాగ్రామాల నాయకులు ఎల్లం, మహిపాల్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, శంకర్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న గౌడసంఘం సభ్యులు

# మార్మోగిన కొమురవెల్లి

- మూడో ఆదివారానికి భారీగా తరలివచ్చిన జనం
- మొక్కులు చెల్లించుకున్న 30వేల మంది భక్తులు
- ప్రొటోకాల్ విషయంలో ఆలయ వర్గాలు, పోలీసులకు వాగ్వాదం



మల్లన్న ఆలయం మహామండపంలో పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 2: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. మల్లన్న దర్శనంతో భక్తులు మంత్రముగ్ధులవుతున్నారు. మూడో ఆదివారం స్వామివారి నామస్మరణలతో మల్లన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం సందర్భంగా 30వేల మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆదివారం వేకువజామున నిద్రలేచి పవిత్ర స్నానం ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్నారు. స్వామివారి దర్శనం అనంతరం గంగరేగుచెట్టు వద్ద ముడుపులు, మహామండపంలో పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు ఒడి బియ్యం, మల్లన్నకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించడంతో పాటు గుట్టపై ఉన్న ఎల్లమ్మకు ఒడిబియ్యం పోసి బోనం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి,ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుడి మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### ఆలయ వర్గాలు, పోలీసులకు వాగ్వాదం

కొమురవెల్లి మల్లన్న దర్శనం కోసం భక్తులను ఇతరమార్గాల నుంచి తీసుకువస్తున్నారనే అంశంపై ఆలయ అధికారులు, కొమురవెల్లి పోలీసులకు వాగ్వాదం జరిగింది. ప్రతి ఆదివారం ఆలయ క్యూ నుంచి కాకుండా ఇతర మార్గాల నుంచి పోలీసులు ప్రొటోకాల్ పేరిట పలువురిని తీసుకువస్తుండడంతో సిబ్బంది కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో తాము దర్శనాలకు రాలేదని, ప్రొటోకాల్ మేరకు డ్యూటీ చేస్తున్నామని సదరు అధికారి కొమురవెల్లి ఎస్సై రాజు మధ్య వాగ్వాదం జరిగింది.

# అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక కృషి

- జనగామ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.11కోట్లు మంజూరు
- నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన నాయకులు



జనగామ ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 2: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించినప్పుడు సమస్యలను నోటు చేసుకుని ఒక్కొక్కటిగా పరిష్కారానికి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు, విజ్ఞప్తి చేస్తూ నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే అంటే ప్రభుత్వంలో ఒక భాగమేనని మర్చిపోయిన అధికార పార్టీ నేతలు తామే మంజూరు చేయించామని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు లు పెడుతుంటే వాటికి ధీటుగా బీఆర్‌ఎస్ సైనికులు ఎమ్మెల్యే పల్లా ఏరోజు ఏఅధికారిని కలిశాడు, వినతిపత్రం అందించి విజ్ఞప్తి చేశాడనే వివరాలతో కూడిన పత్రాలతో పాటు మంజూరు చేయించిన జీవోలను సైతం ఆదివారం విలేకరులకు అందజేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసి అధికారపక్ష నాయకులకు షాక్ ఇచ్చారు.నియోజకవర్గంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్టతో పాటు నియోజకవర్గ పరిధిలోని బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట్ట మండలాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.11కోట్లను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే కృషిని అభినందిస్తూ చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు చేర్యాల పట్టణానికి తరలివచ్చి ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధికార పార్టీ నేతలు తక్కువగా అంచనా వేస్తున్నారని, ఆయన నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు.అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అదేపనిగా వాట్సాప్ గ్రూపుల్లో ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టిస్తూ విద్వేశాలను రెచ్చగొడుతున్నారని, వెంటనే వాటిని మానుకోవాలని లేని పక్షంలో తగు విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో చేర్యాలటౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సిద్దిపేట జిల్లా తాడూరులో ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చేర్యాల, ఫిబ్రవరి 2 : సిద్దిపేట జిల్లా చేర్యాల-సిద్దిపేట రహదారిలో తాడూరు క్రాసింగ్ నుంచి తాడూరు, చిట్యాల, కమలాయపల్లి, దానంపల్లి, అర్జునపట్ల గ్రామాలకు వెళ్లే పీడబ్ల్యూడీ రోడ్డు గుంతలమయమైంది. దీంతో నిత్యం ఈ రోడ్డుపై వెళ్తున్న నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలిగించేందుకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసి ఇటీవల రూ.8 కోట్లను మంజూరు చేయించారు. సదరు నిధులతో 9.70కిలోమీటర్ల గ్రామీణ రోడ్డుకు మరమ్మతు చేసి డాంబర్ వేయనుండడంతో ఆయా గ్రామాల ప్రజలకు మేలు చేకూరనున్నది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తాడూరులో ఎమ్మెల్యే ఫ్లెక్సీకి ఆదివారం క్షీరాభిషేకం చేశారు.అనంతరం పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిధులు మంజూరు చేయిస్తే కొందరు కాంగ్రెస్ నాయకులు వారి రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు పద్ధతులు అవలంభిస్తున్నారని వాటిని మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసుతో పాటు మండల ముఖ్య నాయకులు, తాడూరు, చిట్యాల, కమలాయపల్లి, దానంపల్లి, అర్జునపట్ల గ్రామాల ముఖ్య నాయకులు నర్ర ఉపేందర్‌రెడ్డి, ఈరు ఐలయ్య, లక్ష్మణ్, బంగారి సంపత్, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, రాచకొండ కనకయ్య, రాజు పాల్గొన్నారు.

# అర్బన్ పార్కుకు మోక్షమెప్పుడో?

- ప్రారంభానికి నోచుకుని బొంతపల్లి అర్బన్‌పార్కు
- 690 హెక్టార్లలో అన్ని హంగులతో ఏర్పాటు
- ప్రారంభానికి ఎదురు చూస్తున్న ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు
- అర్బన్ పార్కు పెండింగ్ పనులపై ఇటీవల ఆరాతీసిన కలెక్టర్



అర్బన్ పార్కులో వాచ్‌టవర్ నుంచి అడవిని వీక్షిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి(ఫైల్)



ప్రారంభానికి నోచుకోని బొంతపల్లి అర్బన్ పార్కు

గుమ్మడిదల, ఫిబ్రవరి 2: బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ అడవుల సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి హరితహారం కార్యక్రమం చేపట్టి కోట్లాది మొక్కలు నాటించారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతాలను అర్బన్ పార్కులుగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టారు. మెదక్ జిల్లాలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కును ఏర్పాటు చేసి ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి అటవీ ప్రాంతంలో సైతం అర్బన్ పార్కును కేసీఆర్ ఏర్పాటు చేశారు. నర్సాపూర్‌లోని అర్బన్ పార్కు అందుబాటులోకి తేవడంతో ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. బొంతపల్లి అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కును 690 హెక్టార్లలో సుందరంగా తీర్చిదిద్దారు. ముఖద్వారం, వాచ్‌టవర్, అడవి చుట్టూ ఫెన్సింగ్, రోడ్లు, విశ్రాంతి తీసుకోవడానికి గజీబో, రోడ్డుకు ఇరువైపులా అందమైన మొక్కలు నాటారు. దాదాపు 95శాతం పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత బొంతపల్లి అర్బన్ పార్కు ప్రారంభాన్ని విస్మరించింది. చిన్నపాటి పనులు పూర్తిచేస్తే అందుబాటులోకి తేవచ్చు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా బొంతపల్లి అర్బన్ పార్కు ప్రారంభానికి నోచుకోకపోవడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు నిరాశ చెందుతున్నారు. బొంతపల్లిలో అర్బన్ పార్కుకు సమీపంలో సుప్రసిద్ధ శైవక్షేత్రం బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయం ఉన్నాయి. వీటికి ప్రతి ఆది, సోమవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. హైదరాబాద్ కూతవేటు దూరంలో ఉండడంతో అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారు. వచ్చిన భక్తులు, పర్యావరణ ప్రేమికులు అర్బన్ పార్కులో సేద తీరడానికి ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బొంతపల్లి అర్బన్ పార్కును ప్రారంభించాలని అందరూ కోరుతున్నారు.

### త్వరలో అర్బన్ పార్కును అందుబాటులోకి తెస్తాం..

బొంతపల్లి అర్బన్ పార్కును త్వరలోనే అందుబాటులోకి తేవడానికి కృషిచేస్తాం. ఇటీవల ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవానీతో కలిసి పార్కును సందర్శించా. అర్బన్ పార్కు చివరి దశలో ఉంది. అటవీశాఖ అధికారులతో మాట్లాడి అర్బన్ పార్కుపై ఆరాతీశా. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించా. అర్బన్ పార్కు అందుబాటులోకి వస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనిని త్వరలో ప్రజలకు, పర్యావరణ ప్రేమికులకు, పర్యాటకులకు అందుబాటులోకి తెస్తాం.

– వల్లూరు క్రాంతి, సంగారెడ్డి కలెక్టర్